

“ అశ్రద్ధ అనేది మానవుడిని లోతైన అగాధంలోకి నెట్టేస్తుంది ”


Dr.PRK

# పవర్

పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప



రామకృష్ణ హాస్పిటల్స్

పక్షవాతం, డిస్క్ సమస్యలు, నడుమునొప్పి, మెడ నొప్పులకు పూర్తి చికిత్స కలదు.

నిరుపేదలకు ఉచిత వైద్యం



రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్

విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ

సెల్: 9849485100



సంపుటి : 01 సంచిక : 342 | ఆదివారం 13 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


## మోడీ నేతృత్వంలో ఢిల్లీ డిక్లరేషన్‌కు

# ఏకగ్రీవ ఆమోదం





- గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశంలో కీలక పాత్ర పోషించాలి
- బ్రిక్స్ సభ్య దేశాల కోసం సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) అవసరం
- బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు
- ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిని సంస్కరించాలి
- గ్లోబల్ మిలిటరీ ఖర్చులు పెరిగి పోవడం పట్ల విచారం
- డిక్లరేషన్‌ను ప్రకటించిన ప్రధాని మోదీ
- పుతిన్, జిన్‌పింగ్ లకు మోదీ ఘన స్వాగతం
- హాజరైన 21 దేశాలు

**న్యూఢిల్లీ, పవర్ న్యూస్**

భారత రాజధాని న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. సమావేశంలో న్యూ ఢిల్లీ డిక్లరేషన్ 2026 కు బ్రిక్స్ కూటమిలోని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. బ్రిక్స్ సమావేశానికి ఆతిథ్యం ఇచ్చిన భారత్ కు ఇది అతిపెద్ద దౌత్య విజయం అని చెప్పొచ్చు. భారత్ న్యూ ఢిల్లీ డిక్లరేషన్ కు కూటమిలోని ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం. ఇది ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ అంశాలపై సభ్య దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ న్యూ ఢిల్లీ డిక్లరేషన్ కు ఏకాభిప్రాయం లభించడం భారత్ కు అతిపెద్ద దౌత్య విజయంగా నిలుస్తుందని అన్నారు. అంతర్జాతీయ విధానాలు, ఆర్థిక సహకారం, శాంతిభద్రతలపై సభ్య దేశాల ఉమ్మడి నిబద్ధతను ఈ నిర్ణయం చాటిచెబుతోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను ఇక ..మిగతా 2లో

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

### నిమజ్జనాలు చేసే చెరువుల వద్ద ఏర్పాట్లు.. గణేశ్ ఉత్సవాలపై రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, పవర్ న్యూస్**

వినాయక చవితి ఉత్సవాలను ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటనకూ తావులేకుండా, వైభవంగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది. పండుగ వేళ భక్తులకు, మండప నిర్వాహకులకు ఎదురయ్యే క్షేత్రస్థాయి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీలు, ప్రజాప్రతినిధులు, పోలీసు, మున్సిపల్ ఉన్నతాధికారులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయిన ఆయన పండుగ నిర్వహణపై సమగ్ర సమీక్ష జరిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన తెలంగాణలోనే గణేశ్ మండపాలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. నిర్వాహకులు అధికారులకు ముందస్తుగా దరఖాస్తు చేసుకుని ఈ ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందొచ్చని సూచించారు. "స్థానిక పోలీస్ స్టేషన్లలో మండపాల సమాచారం ఇవ్వండి. దానివల్ల ట్రాఫిక ఇబ్బందులు లేకుండా చూసుకోవడమే కాకుండా, మన ..మిగతా 2లో



## ధరణిలో 23 వేల ఎకరాల

# అక్రమాలు

### భూములను కొల్లగొట్టకూడదనే చట్టం

- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి..
- 22ఏపై అసెంబ్లీలో వాడీవేడీగా చర్చ
- ఈనెల 16కు శాసనసభ వాయిదా

**హైదరాబాద్, పవర్ న్యూస్**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు భూముల వ్యవహారం హాట్‌టాపిక్‌గ్గ మారింది. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల జాబితా అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. 22ఏకారణంగా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, భూముల రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. తాజాగా అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గణాంకాలతో బీఆర్ఎస్‌కు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 22ఏ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, భూముల విలువలు భారీగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడుతోందని విమర్శించారు. ఈ ఆరోపణలకు అసెంబ్లీ వేదికగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమాధానమిచ్చారు. 22ఏ కారణంగా రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రాబడి తగ్గిపోయాయన్న ప్రచారంలో ..మిగతా 2లో

# దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- కొత్తగా 2.50 లక్షల నూతన పింఛన్లు

2

## కేసీఆర్ ఇంటి శుద్ధీకరణను ప్రోత్సహించినందుకు కేసీఆర్ ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు చేయాలి

– బీఆర్ఎస్ పార్టీని కూడా రద్దు చేయాలని ఎన్నికల సంఘాన్ని కలుస్తాం

-- డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్, సెప్టెంబర్ 12, పవర్ న్యూస్**

కేసీఆర్ ఫార్మ్‌హౌస్‌కు దళితులు నిరసన కార్యక్రమంలో భాగంగా వెళ్లిన అనంతరం పసుపు నీళ్లతో ఇంటిని శుద్ధీకరణ చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ తీవ్రంగా మండిపడ్డారు. దళితులు ఇంటికి వచ్చినందుకు శుద్ధీకరణ చేయడాన్ని ప్రోత్సహించిన కేసీఆర్ దీనికి నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పార్టీ అధినేతలే కుల వివక్షను ప్రోత్సహించే విధంగా వ్యవహరిస్తే, కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి సందేశం వెళ్తుందని ప్రశ్నించారు. కేసీఆర్ ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని, కుల వివక్షను ప్రోత్సహించే చర్యలకు బాధ్యత వహించిన బీఆర్ఎస్ పార్టీపై కూడా చర్యలు తీసుకుని ఆ పార్టీని రద్దు చేయాలని ఎన్నికల సంఘాన్ని కలిసి కోరుతామని డాక్టర్ రామకృష్ణ తెలిపారు. అలాగే స్పీకర్, గవర్నర్‌ను కలిసి కేసీఆర్‌తో పాటు బాధ్యులైన ప్రజాప్రతినిధుల సభ్యత్వాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతామని అన్నారు. కేటీఆర్, హరీశ్‌రావులతో పాటు ఘటనను సమర్థించిన వారంతా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించిన ఘటనపై బహిరంగ క్షమాపణ చెప్పి, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం కొనసాగుతుందని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు.

## 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల

# ఆర్థిక వ్యవస్థ తెలంగాణ లక్ష్యం

### శ్రీధర్ బాబు

- హైదరాబాద్ లో వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నామన్న శ్రీధర్ బాబు
- దీని కోసమే క్యూర్ యాక్ట్ 2026ను రూపొందించామని వెల్లడి
- హైదరాబాద్ ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ సిటీగా ఎదిగిందన్న మంత్రి



**హైదరాబాద్, పవర్ న్యూస్**

హైదరాబాద్ నగరంలో రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వికేంద్రీకృత నగర పాలనను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకోసమే ప్రత్యేకంగా 'క్యూర్ యాక్ట్- 2026' శాసనాన్ని రూపొందించినట్లు శాసనసభలో ఆయన వెల్లడించారు. నగర పరిపాలనను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజా సమన్వయంతో ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్ 2047' ..మిగతా 2లో

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం: కిషన్ రెడ్డి



- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ అయిన కిషన్ రెడ్డి
- ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు రక్షణశాఖ సమ్మతి తెలిపిందని వెల్లడి
- డీపీఆర్, మాస్టర్ ప్లాన్ ప్రక్రియ త్వరగా ముగించాలని నిర్ణయించామన్న కేంద్ర మంత్రి

**న్యూఢిల్లీ, పవర్ న్యూస్**

ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ..మిగతా 2లో

# మోడీ నేతృత్వంలో ఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకగ్రీవ ఆమోదం

**మొదటి పేజీ తరువాయి...**

ఏమాత్రం ఆలస్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకుంటూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగాలని సూచించారు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లేందుకే ప్రయత్నిస్తామని ప్రధాని తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. అధికారాలు, విశేషాధికారాలు ఉన్న అగ్ర దేశాల వ్యవస్థను రాబోయే 20 ఏళ్లలో ఒక భాగస్వామ్య వేదికగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాల కోసం ఒక సురక్షితమైన డిజిటల్ రిపోజిటరీ (డేటాబేస్) సృష్టించగలమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సంస్కరణల దిశానిర్దేశం చేయడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలను, అంగీకరించిన అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి 'బ్రిక్స్ కంటిన్యూటీ, ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కష్టకాలంలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలకు ఈ కూటమి ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆయన కోరారు. ఇక రెండు రోజుల పాటు జరిగే ఈ 18వ బ్రిక్స సమావేశంలో భారత్, రష్యా, చైనా, బ్రెజిల్, ఈజిప్ట్, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా సహా మొత్తం 21 దేశాలు పాల్గొన్నాయి. అయితే విబేధాలు పక్కన పెట్టి మరీ ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు న్యూ






ఢిల్లీ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం కీలకంగా మారింది. న్యూ ఢిల్లీ డిక్లరేషన్ లోని కీలక విషయాలు చూస్తే ప్రపంచ వాణిజ్య సంస్థల నిబంధనలకు విరుద్ధంగా, వాణిజ్యాన్ని దెబ్బతీసే విధంగా ఏకపక్ష సుంకాలు పెరగడంపై బ్రిక్స్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి ఏకపక్ష చర్యలను బ్రిక్స్ దేశాలు ఖండించాయి. అలాగే ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యుద్ధాలు, ఘర్షణలను శాంతి యుతంగా, దౌత్య పరంగా మాత్రమే పరిష్కరించుకోవడానికి తాము కట్టుబడి ఉన్నామని బ్రిక్స్ కూటమి స్పష్టం చేసింది. అలాగే ప్రపంచంలో నెలకున్న సమస్యలపై వివిధ దేశాలు చూసే దృక్కోణాన్ని తాము స్వాగతిస్తున్నట్లు తెలిపాయి. దాంతోపాటు అంతర్జాతీయ సమస్యలపై శాంతి యుత చర్చలు, భాగస్వామ్యాన్ని నొక్కి చెప్పాయి. అలాగే గతేడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని బ్రిక్స దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది క్రిమినల్ చర్య అని ఎప్పటికీ క్షమించరానిదని తెలిపాయి. ఈ ఘోర ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా మరెందరో గాయపడినట్లు వివరించాయి. ఇలాంటి ఉగ్రవాద చర్యలను అసలు ఉపేక్షించేది లేదని బ్రిక్స కూటమి దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఎదుర్కొనేందుకు తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. వీటితోపాటు మారుతున్న, వర్తమాన ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని బ్రిక్స దేశాలు డిమాండ్ చేశాయి. భారత్ నేతృత్వంలో ఈ బ్రిక్స్ సదస్సు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని తీర్మానించాయి. ఐరాస భద్రతా మండలిలో నిర్మాణాత్మక మార్పులు, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలకు భద్రతా మండలిలో మెరుగైన ప్రాతినిధ్యం దక్కాలని ఢిల్లీ డిక్లరేషన్ ఆకాంక్షించింది. ముఖ్యంగా భద్రతా మండలిలో భారత్, బ్రెజిల్ దేశాలకు మరింత పెద్ద పాత్ర దక్కాలన్న డిమాండ్‌కు శాశ్వత సభ్య దేశాలైన చైనా, రష్యాలు తమ మద్దతును పునరుద్ఘాటించాయి. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం దక్కాలని బ్రిక్స కూటమి డిమాండ్ చేసింది. వాణిజ్యపరంగా ఈ సదస్సులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీలలోనే ఎక్కువగా జరగాలని, సరిహద్దు చెల్లింపుల కోసం ఆచరణాత్మక పరిష్కారాలను సులభతరం చేయాలని డిక్లరేషన్ పేర్కొంది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా విధిస్తున్న సుంకాలు, బలవంతపు చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మరోవైపు ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ ప్రదర్శించాలని పిలుపునిచ్చింది. పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. సరిహద్దు ఉగ్రవాదం, ఉగ్ర నిధులు అరికట్టాలని, ఉగ్రవాద నిర్మూలనలో ద్వంద్వ వైఖరి వీడాలని స్పష్టం చేసింది.

అలాగే అణు కేంద్రాలపై జరుగుతున్న దాడులను, పెరుగుతున్న అణ్వస్త్ర ప్రమాదాలను ఖండించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తూ, గ్లోబల్ మిలిటరీ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాలకు శిలాజ ఇంధనాలు ఇంకా అవసరమేనని స్పష్టం చేస్తూనే, పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు మారాలని డిక్లరేషన్ సూచించింది. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటుకు బ్రిక్స్ దేశాలు తీర్మానించాయి. ఆర్థిక, సామాజిక వృద్ధిలో నిర్ణయాధికారులుగా మహిళల పాత్ర అత్యంత కీలకమని న్యూఢిల్లీ డిక్లరేషన్ గుర్తించింది.

## తెలంగాణలో దంచికొడుతున్న వానలు.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, పవర్ న్యూస్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండ్రోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం కూడా ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వర్షాలు పడతాయని తెలిపింది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది.గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో అత్యధికంగా 9.35 సెం.మీ., ఖమ్మం జిల్లా కారేపల్లిలో 6.5 సెం.మీ. వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా కన్నెపల్లిలో ఏకంగా 13.55 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడించాయి.

ఈ వర్షాల కారణంగా ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, కుమరం భీం ప్రాజెక్టుల్లోకి 2,172 క్యూసెక్కుల వరద వస్తుండగా, అధికారులు 1,378 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# ధరణిలో 23 వేల ఎకరాల అక్రమాలు

**మొదటి పేజీ తరువాయి...**

వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన గణాంకాలను వెల్లడించారు. మంత్రి అసెంబ్లీకి తెలిపిన వివరాల ప్రకారం 2025 ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు ఐదు నెలల కాలంలో రాష్ట్రంలో మొత్తం 4,90,478 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయన్నారు. అదే ఐదు నెలల కాలాన్ని 2026లో పరిశీలిస్తే 5,10,273 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయినట్లు తెలిపారు. అంటే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 19,795 డాక్యుమెంట్లు అదనంగా రిజిస్టర్ అయ్యాయని మంత్రి వివరించారు. ఇక రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చిన ఆదాయాన్ని పరిశీలించినా తగ్గుదల కనిపించలేదని మంత్రి పొంగులేటి తెలిపారు. 2025లో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల్లో రూ.6,216 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అదే 2026లో ఐదు నెలల కాలంలో రూ.7,575 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. అంటే గత ఏడాదితో పోలిస్తే రూ.1,359 కోట్ల అదనపు ఆదాయం వచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ గణాంకాలను ప్రస్తావిస్తూ 22ఏ వల్ల రిజిస్ట్రేషన్లు, ఆదాయం తగ్గిపోయాయన్న బీఆర్ఎస్ ఆరోపణలను మంత్రి పొంగులేటి తిప్పికొట్టారు. వాస్తవ పరిస్థితిని గణాంకాలే చెబుతున్నాయని స్పష్టం చేశారు. మరోవైపు 22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో మాత్రం రాజకీయ వాదోపవాదాలు కొనసాగాయి. భూముల రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రియల్ ఎస్టేట్ రంగం, సామాన్యుల భూ హక్కులు వంటి అంశాలు ఈ వివాదంతో ముడిపడి ఉన్నాయి. దీంతో 22ఏ అంశం కేవలం రెవెన్యూ వ్యవహారంగా కాకుండా తెలంగాణ రాజకీయాల్లో కీలకమైన రాజకీయ అంశంగా మారింది. మరోవైపు తెలంగాణ శాసనసభ సాక్షిగా రాష్ట్రంలో నెలకున్న భూ సమస్యలు, 22ఏ నిబంధనలు , ధరణి అక్రమాలపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకుని గత పాలకులు లక్షలాది ఎకరాలను చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా వారి బండారం బయటపడుతుండటంతోనే సభ నుంచి తప్పించుకొని తిరుగుతున్నారని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను స్వప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం, వాళ్ల బంధువులు మాత్రమే బాగుపడ్డారని అన్నారు. అలాగే ధరణి తప్పిదాలతో వందల మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలోని దాదాపు 2.49 కోట్ల ఎకరాల భూమిని తమ సొంత ఆస్తిగా భావించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. ధరణి పోర్టల్ నిర్వహణను దివాలా తీసిన ఒక విదేశీ కంపెనీకి అప్పగించారని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్ పై ఉన్న నియంత్రణను దుర్వినియోగం చేస్తూ అర్ధరాత్రి సమయాల్లో రిజిస్ట్రేషన్లు చేశారని కీలక ఆరోపణలు చేశారు. ప్రజల ఆస్తులను పరిరక్షించడమే రెవెన్యూ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శాసనసభలో 22ఏ నిషేధిత



భూముల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ఆశామాషీగా తీసుకురాలేదని.. దాదాపు 18 రాష్ట్రాల్లోని అధికారులు అధ్యయనం చేశాక..ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే భూ భారతికి రూపకల్పన చేశామని స్పష్టం చేశారు. భూభారతి ఎన్ ఐసి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోనే పారదర్శకంగా నడుస్తుందని తెలిపారు. అలాగే 22ఏ నిషేధిత భూముల అంశంపై మాట్లాడుతూ.. 2023 నాటికి 22 ఏ జాబితాలో కోటి 2 లక్షల 52 వేల 690 ఎకరాలకు సంబంధించిన వివరాలను సభ ముందు ఉంచారు మంత్రి పొంగులేటి. వీటిలో అటవీ, అసైన్డ్, ఇతర ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 1995లో ఘట్కేసర్ రైల్వేస్టేషన్ భూమిని కూడా ఒకరికి రిజిస్ట్రేషన్ చేశారన్న మంత్రి పొంగులేటి, అలాంటి అక్రమాలు మళ్లీ జరగొద్దనే నిషేధిత భూముల జాబితా తెచ్చారన్నారు. మళ్లీ కేసీఆర్ హయంలో 2016లో కొత్తగా జీవో 121 జారీ చేశారని చెప్పారు. జీవో 121 తీసుకువచ్చి చాలామంది రైతులను నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. తమ ప్రభుత్వం కొత్తగా నిషేధిత జాబితాలో ఒక్క ఎకరం కూడా చేర్చలేదని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల ఆస్తుల పరిరక్షణే రెవెన్యూ సంస్కరణల లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నిషేధిత జాబితాలో ఉండకూడని భూములు కొన్ని ఆనాటి నుంచి ఉన్నాయని పొంగులేటి వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనూ అదే కాపీని అప్‌లోడ్ చేశారన్నారు. దానిని అధికారులు ప్రింట్ తీసి మరోసారి అప్‌లోడ్ చేశారని వివరించారు. ఇక్కడే పొరపాటు జరిగిందని చెప్పారు. ఇది మొదటి నుంచీ జరిగిన పొరపాటని మంత్రి అసెంబ్లీలో వెల్లడించారు. ఉమ్మడి ఏపీ హయాం నుంచి వచ్చిన జీవోల ఆధారంగానే ఆ కాపీ రూపొందిందని పొంగులేటి గుర్తు చేశారు. గతంలో కొన్ని భూములను ప్రభుత్వం విక్రయించడం, ప్లాట్లు చేసి ఇవ్వడం జరిగిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విక్రయించిన భూములను అధికారులు పొరపాటున 22ఏలో చేర్చారన్నారు. అధికారులు చేసిన పొరపాటును యుద్ధప్రాతిపదికన సరిదిద్దుతున్నామని చెప్పారు. నిషేధిత జాబితా నుంచి గతంలోనే తొలగిస్తూ ఇచ్చిన జీవో చూపితే వెంటనే తొలగిస్తున్నామన్నారు. ఒక్కరోజులోనే మ్యుటేషన్ చేయటం వల్ల ఎన్నో అక్రమాలు జరిగాయన్న పొంగులేటి, ధరణి పోర్టల్‌లో 80 మాడ్యూల్స్ పెట్టి పేద రైతులను తీవ్రంగా ఇబ్బంది పెట్టారని మండిపడ్డారు. ఇప్పుడు భూభారతి చట్టంలో 80 మాడ్యూల్స్‌కు బదులు కేవలం 5 మాడ్యూల్స్ పెట్టామన్నారు. ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి మొత్తం 1,02,05,250 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభకు వివరించారు. 22ఏలోని ప్రభుత్వ వ్యవసాయ భూములు 96,36,777 ఎకరాలు ఉన్నాయన్నారు. ప్రైవేటు వ్యవసాయ భూమి 3,73,930 ఎకరాలు ఉందని వివరించారు. వ్యవసాయేతర భూమి 1,94,543 ఎకరాలున్నట్లుగా సభలో వివరించారు. ఇవి కాకుండా ఎండోమెంట్ భూములు 5,12,792 ఎకరాలు ఉన్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ దిగిపోయేనాటికి, ఇప్పటికి నిషేధిత జాబితాలోని భూమి 47,440 ఎకరాలు తగ్గిందని పొంగులేటి తెలిపారు. 23వేల ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు ఇచ్చామన్నారు. పాత జీవోల్లోని తప్పులను గుర్తించి మరో 20వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించామని చెప్పారు. 22ఏ నుంచి తొలగించిన మొత్తం 47,440 ఎకరాల్లో ప్రతి ఎకరాకు లెక్కలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తొలగించిన 23వేల ఎకరాలకు లెక్కలు లేవని కమిటీ చెప్పిందని పొంగులేటి గుర్తుచేశారు. కోట్ల మంది రైతుల వివరాలను విదేశీ సంస్థ అయిన టెరాసిస్ చేతిలో పెట్టారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక, టెరాసిస్ సంస్థను తొలగించి కేంద్ర సంస్థ అయిన ఎన్ఐసీకి అప్పగించామన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం 387 గ్రామాలకు నక్షలు లేవన్నారు. దాదాపు 125 ఏళ్ల తర్వాత గ్రామాల్లో సమగ్ర భూసర్వే చేపట్టామని పొంగులేటి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన గ్రామాల్లో ఇప్పటికే భూమి మొత్తం సర్వే చేసి రైతులకు పాసుపుస్తకాలు ఇచ్చామని తెలిపారు.వచ్చే ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా భూసర్వే పూర్తి చేసి రైతులకు మేలు చేస్తామని స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను గుప్పిట్లో పెట్టుకొని, గత పాలకులు అర్ధరాత్రి వేళ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలోని 2.49 కోట్ల ఎకరాలను తమ సొంత ఆస్తిలా గత పాలకులు భావించారని ఆక్షేపించారు. ధరణి పోర్టల్‌లో దొర్లిన తప్పులకు లక్షలాది రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పోర్టల్‌లో తప్పుల నమోదు వల్ల వందల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి పోర్టల్‌కు లాక్ అనే సిస్టమ్ పెట్టి అందరి భూములపై నిఘా పెట్టారన్నారు.



# దసరాకు కొత్త పింఛన్ల పంపిణీ

హైదరాబాద్, పవర్ న్యూస్

తెలంగాణలో కొత్త పించన్ల కోసం ఎదురుచూస్తున్నవారికి శుభవార్త. కొత్త పింఛన్ల పంపిణీకి రేవంత్ సర్కార్ ముహూర్తం ఖరారు చేసింది. దసరా కానుకగా కొత్త పింఛన్లను అందించనుంది. కొత్తగా రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల నూతన పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా వీరిలో అసలైన అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్నవారి ఇంటికి అధికారులు నేరుగా వెళ్లనున్నారు. వారికి నిజంగా అర్హత ఉందా.. లేదా అనే వివరాలు పరిశీలించనున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అనంతరం వచ్చే నెల తొలివారంలో అర్హులను ఎంపిక చేసి జాబితా సిద్దం చేయనున్నారు. అర్హులైన వారికి దసరా నుంచి పించన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం సిద్దమవుతోంది. ఇప్పటికే ఇందుకు అవసరమైన బడ్జెట్ కూడా కేటాయించారు. దీంతో అర్హులను ఎంపిక చేయడమే తరువాయి. ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పించన్ మంజూరు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే క్షేత్రస్థాయి పరిశీలనలో జాప్యం, సర్టిఫికేట్ల జారీలో సమస్యలు తలెత్తడంతో ఆలస్యమైంది. ఆగస్ట్ 9 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుండగా సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. అయితే దివ్యాంగులు, డయాలసిస్, ఫైలేరియా, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు పత్రాలు అవసరం. ఒంటరి మహిళలకు సంబంధించి విడాకుల డాక్యుమెంట్స్, కోర్టు ఉత్తర్వులతో పాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ అవసరమవుతుంది.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

**మొదటి పేజీ తరువాయి...**

భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేయడానికి వీలవుతుందిని ఆయన స్పష్టం చేశారు. ద్యా టిడ్87 వద్ద నిమజ్జన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తూ "మనం అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నామో, గణేశ్ నిమజ్జనాలకు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పెద్ద క్రేన్లు పెట్టేందుకు వీలుగా చెరువు గట్లు, పరిసరాలను సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి 24 గంటలూ పర్యవేక్షణ ఉండాలని, మున్సిపల్, పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. "హైదరాబాద్ ప్రశాంతంగా, సురక్షితంగా ఉంటేనే మన రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయి, మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. అందుకే శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. మండపాల నిర్వాహకులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

## 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే

# తెలంగాణ లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

పాలసీ విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు. చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు, మూసీ తీరం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు ప్రపంచ స్థాయి మెట్రోపాలిటన్ నగరంగా హైదరాబాద్ ఎదిగిందని మంత్రి కొనియాడారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (+జజ) ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్... రాష్ట్ర ఆర్థిక రంగానికి ప్రధాన గ్రోత్ ఇంజన్ అని గుర్తుచేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.7 శాతం వృద్ధితో రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని... ఇందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలే సింహభాగం భాగస్వామ్యం వహిస్తున్నాయని ఆర్థిక గణాంకాలతో వివరించారు. ప్రస్తుతం నగరం ఔటర్ రింగ్ రోడ్డు వరకు వేగంగా విస్తరించిన నేపథ్యంలో మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఓఆర్ఆర్ పరిధికి ప్రత్యేక కార్యనిర్వాహక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు ప్రకటించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, ప్రజా రవాణా, ట్రాఫిక్ నివారణ, చెత్త నిర్వహణ, వరదల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక శాఖలను ఒకే గొడుగు కిందకు తెచ్చి నగరపాలనను అంతర్జాతీయ ప్రమాణాలకు చేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

## ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం: కిషన్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి...**

ఈ ప్రాజెక్టు పురోగతిపై ఈరో ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ (జీఖూా) అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (×ూఖీ) వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మట్టి వినాయకుడిని అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

## పర్యావరణహితమైన మట్టి గణపతులనే పూజిద్దాం -- బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



(హైదరాబాద్ -- పవర్):
వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలో పర్యావరణహితమైన మట్టి వినాయకుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారిని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు మర్యాదపూర్వకంగా కలసి, పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు) మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ వినాయక చవితి పండుగ సందర్భంగా రసాయనాలతో తయారు చేసిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (ఫూూ) విగ్రహాలకు బదులుగా, పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణపతులను మాత్రమే ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ -- జల కాలుష్య నివారణ: మట్టి వినాయకుల వినియోగం ద్వారా నదులు, చెరువులు, జలాశయాలు కలుషితం కాకుండా కాపాడుకోవచ్చని, జల పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. సంప్రదాయాలకు ప్రాధాన్యత: బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నామని, మట్టి విగ్రహాలను వాడటం ద్వారా మన సాంప్రదాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందన్నారు. సామాజిక బాధ్యత: పర్యావరణాన్ని పరిరక్షించడం అనేది సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ స్పృహను పెంపొందించుకుంటూ, ప్రజలందరూ సురక్షితంగా, పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు

# భారీ వర్షంలోనూ బాధిత కుటుంబాలకు అరూరి రమేష్ పరామర్శ

(పర్వతగిరి -- పవర్)
భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పర్వతగిరి మండలంలో పర్యటించి, పలువురు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మండలంలోని బూర్గుమల్ల గ్రామానికి చెందిన బొబ్బల భగీరథ రెడ్డి కుమార్తె లక్ష్మి చంద్ర రెడ్డి పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో ఇటీవల మరణించగా.. ఆమె పార్థివ దేహానికి అరూరి రమేష్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అలాగే సోమారం గ్రామానికి చెందిన రాపాక మధు తల్లి సమ్మక్క మరణించడంతో ఆమె భౌతికకాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలిపారు. అనంతరం పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన మడ్డి కుమారస్వామి ఇటీవల మృతి చెందగా, నేడు వారి నివాసానికి వెళ్లిన అరూరి రమేష్ కుటుంబ సభ్యులను నేరుగా పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ (ఫూజూ) చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్,



మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మండల మాజీ రైతు బంధు అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజుతో పాటు పలువురు స్థానిక మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోహిణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి 'ఉత్తమ నరాల వైద్యశాల 2026' పురస్కారం

(హనుమకొండ -- పవర్)
హెచ్‌ఎమ్‌టీవీ మరియు ది హన్స్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవనంలో ఘనంగా నిర్వహించిన "ఎముకలు, నరాలు, వెన్నుపాము మరియు నొప్పుల నివారణ సంరక్షణ సదస్సు మరియు పురస్కారాలు 2026" కార్యక్రమంలో హనుమకొండలోని రోహిణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రతిష్ఠాత్మక "సంవత్సర ఉత్తమ నరాల వైద్యశాల -- 2026" పురస్కారాన్ని దక్కించుకుంది.

ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని రోహిణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సంచాలకులు, ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి స్వీకరించారు.

సిబ్బంది సమిష్టి కృషికి లభించిన గుర్తింపు: డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి

ఈ సందర్భంగా డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ.. రోహిణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి ఈ పురస్కారం రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. ఆస్పత్రి సంచాలకులు, నిర్వాహకులు, సలహాదారులు, వైద్యులు, పరిచారికా (నర్సింగ్) సిబ్బంది మరియు ఇతర సిబ్బంది సమిష్టి కృషి, అంకితభావానికి ఈ పురస్కారం ఒక నిదర్శనమని తెలిపారు.

?రోగులకు అత్యాధునిక సాంకేతిక వైద్య సదుపాయాలు, నాణ్యమైన



చికిత్స అందించడమే తమ ఆస్పత్రి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నరాల వైద్యం, నరాల శస్త్రచికిత్స, వెన్నుపాము సంరక్షణ, ఎముకల వైద్యం, నొప్పుల నివారణ మరియు పునరావాస రంగాల్లో మరింత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు నిరంతరం కృషి చేస్తామని పునరుద్ఘాటించారు. హనుమకొండతో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రజలకు రోహిణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందిస్తున్న నిరంతర వైద్య సేవలకు ఈ పురస్కారం ఒక ప్రత్యేక గుర్తింపుగా నిలిచిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహిద్దాం

## జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ



(భూపాలపల్లి -- పవర్)
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియు తంగా, సురక్షితంగా నిర్వహించేం దుకు నిర్వాహకులు, ప్రజలు పోలీస్ శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. విగ్రహ ప్రతిష్టాపన నుంచి నిమజ్జనం వరకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ జారీ చేసిన ముఖ్యమైన నిబంధనలు:ఇంటిమేషన్ ఫారం తప్పనిసరి: గణేష్ విగ్రహ ప్రతిష్టాపన, నిమజ్జన ఊరేగింపుకు సంబంధించిన వివరాలను తెలంగాణ పోలీస్ అధికారిక పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలి. విద్యుత్ భద్రత: అనధికారిక విద్యుత్ కనెక్షన్లను వినియోగించరాదు. T.G.S.P.D.C.L. ద్వారా మాత్రమే అధికృత విద్యుత్ కనెక్షన్ పొందాలి. డీజేలకు అనుమతి లేదు: సౌండ్ సిస్టమ్స్ కోసం డీజేలను ఉపయోగించరాదు. లౌడ్‌స్పీకర్లను కేవలం 2 బాక్స్ టైప్ స్పీకర్లకు మాత్రమే పరిమితం చేయాలి. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగం పూర్తిగా నిషేధం. CCTV కెమెరాలు తప్పనిసరి: ప్రతి గణేష్ మంటపం వద్ద CCTV, వీడియో కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

# ఐజేయూ డివిజన్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌కు సన్మానం



(ఆత్మకూరు -- పవర్)
ఆత్మకూరు మండల రిపోర్టర్ పెరుమాండ్ల శ్రీనివాస్ ఇండియన్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ), పరకాల డివిజన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన సందర్భంగా ఆత్మకూరు మండల జర్నలిస్ట్ పరపతి సంఘం సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ముదిగిరి ఓదేలు, ఆత్మకూరు జర్నలిస్ట్ పరపతి సంఘం అధ్యక్షులు పోగాకుల అనిల్, ఉపాధ్యక్షులు సయ్యద్ వలి, జాయింట్ సెక్రటరీ కోల రాజేందర్, సలహాదారులు వంగేటి ప్రభాకర్, తోగరు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపు

(హనుమకొండ -- పవర్)



పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా పర్యావరణానికి హాని కలగకుండా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని ఈ సందర్భంగా కోరారు.

కార్యక్రమ వివరాలు:

తేదీ: 13-09-2026 (ఆదివారం)

సమయం: ఉదయం 10:30 గంటలకు

వేదిక: బాలసముద్రం క్యాంప్ కార్యాలయం, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఈ పంపిణీ కార్యక్రమానికి భక్తులు, పర్యావరణ ప్రేమికులు, నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను స్వీకరించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు

# శుద్దీకరణకు పాల్పడిన వారిపై ఎస్సి , ఎస్టి చట్టం క్రింద కేసులు నమోదు చేయాలి

### వరంగల్ డిసిసి ఎస్సి విభాగం ఉపాధ్యక్షులు పసునూరి భాస్కర్

వరంగల్, సెప్టెంబర్ 12 ( పవర్ న్యూస్ ):



మాజీ సీఎం కేసిఆర్ ఫాంమ్ హౌస్ సమీపంలో దళిత దండోరా కార్యక్రమం అనంతరం రోడ్డు, పరిసరాలను పసుపు, తులసి నీళ్లతో శుద్ధి చేయడం దళితుల మనోభావాలను దెబ్బతీశాయని శుద్దీకరణకు పాల్పడినవారిపై ఎస్సి, ఎస్టి చట్టం క్రింద కేసులు నమోదు చేయాలని వరంగల్ డిసిసి ఎస్సి విభాగం ఉపాధ్యక్షులు పసునూరి భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితులు నడిచిన నేలను పసుపు నీళ్లతో శుద్ధి చేయడం బిఆర్ఎస్ పార్టీ సంస్కారానికి, అనాగరిక చర్యలకు నిదర్శనమని భాస్కర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను జీర్ణించుకోలేక బిఆర్ఎస్ నాయకులు ఇలాంటి అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దళితులను అవమానించేలా వ్యవహరిస్తున్న బిఆర్ఎస్ పార్టీని ప్రజలు క్షమించబోరని, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు.దళితులు ఒక ప్రాంతానికి వచ్చినందుకు శుద్దీకరణ చేయడం రాజ్యాగం కల్పించిన స్వేచ్ఛను అవమాణించడమే నని,సమాజంలో మాసిపోయిన అంటరానితనాన్ని ఇలాంటి చర్యలు ప్రోత్సాహిస్తాయని విమర్శించారు.తెలంగాణ ఉద్యమంలో దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కేసిఆర్ ఆ విషయాన్ని మరిచిపోవద్దన్నారు.దళితుల సమస్యలపై నిరసన తెలిపే హక్కు వారికి లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి కెసిఆర్ సీఎం అయ్యారని అనంతరం దళిత ఉపముఖ్యమంత్రిని తొలగించిన చరిత్ర కేసీఆర్ దేనని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రతిపక్ష హోదాలో ఉన్న కేసీఆర్ ఇలాంటి ఘటనపై స్పందించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ లోని దళిత ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు ఈ ఘటనపై తక్షణ వైఖరి స్పష్టం చేయాలని కోరారు.

# KCR's MLA Membership Must Be Cancelled for Promoting the Purification of His HouseWe Will Approach the Election Commission Seeking Cancellation of the BRS Party

## – Dr. Perumandla Ramakrishna



**Warangal, September 12:**

Senior Congress Party leader and State Honorary President of Madiga Hakkula Dandora, Dr. Perumandla Ramakrishna, strongly condemned the act of purifying KCR's farmhouse with turmeric water after Dalits visited the premises as part of a protest, stating that it is a grave insult to the self-respect and dignity of Dalits.Dr. Ramakrishna demanded that KCR take moral responsibility for encouraging the purification of his house merely because Dalits had visited it. He questioned what message such conduct by the top leadership of a political party sends to its leaders, workers and followers at the grassroots level.KCR's MLA membership must be cancelled, and the BRS party must also face action and be de-recognised for allegedly promoting caste discrimination. We will approach the Election Commission and demand appropriate action, including cancellation of the BRS party's recognition, Dr. Ramakrishna stated.He further said that they would meet the Speaker and the Governor and request appropriate action regarding the memberships of KCR and other responsible public representatives. He demanded that KTR, Harish Rao and all those who supported or justified the incident publicly apologise.Our fight will continue until a public apology is tendered for insulting the dignity of Dalits and appropriate action is taken against those responsible, Dr. Perumandla Ramakrishna asserted.

## ఆదర్శ నగర్ కాలనీలో ఉన్న ట్రాన్స్ఫార్మర్‌తో ప్రజలకు ప్రాణాపాయం

వరంగల్, సెప్టెంబర్ 12(పవర్ న్యూస్ ):

17 వ డివిజన్ ఆదర్శ నగర్ కాలనీ మెయిన్ రోడ్డులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ తో ప్రజలకు ప్రాణాపాయం ఉంది.నూతనంగా రైల్వే శాఖ చేపట్టిన లో లెవెల్ నిర్మాణం సరిగ్గా ఈ ట్రాన్స్ఫుమర్ నుంచి ప్రారంభం ,ఆరంభం అవుతుంది.కాలనీ లోపలికి వెళ్ళాలి అంటే మూల మలుపు ఆనుకొని పిచ్చి మొక్కలతో ఈ ట్రాన్స్ఫుమర్ ఇబ్బంది గా ఉంది....దీని వల్ల రానున్న రోజుల్లో ప్రాణనష్టం జరిగే పరిస్థితి ఉన్నందు వల్ల...సంబంధిత అధికారులు డిఇ,ఏఈ లు ఈ ట్రాన్స్ఫార్మర్ ను పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని ఆదర్శ నగర్ కాలనీ వాసులు కోరుతున్నారు.



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మట్టి వినాయకుడిని అందజేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

### పర్యావరణహితమైన మట్టి గణపతులనే పూజిద్దాం -- బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు

(హైదరాబాద్ -- పవర్):



వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలో పర్యావరణహితమైన మట్టి వినాయకుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారిని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు మర్యాదపూర్వకంగా కలసి, పర్యావరణ పరిరక్షణకు సంకేతంగా మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు శాసనసభ్యులు (ఎమ్మెల్యేలు) మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ వినాయక చవితి పండుగ సందర్భంగా రసాయనాలతో తయారు చేసిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు బదులుగా, పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణపతులను మాత్రమే ప్రతిష్టించి పూజించా లని సూచించారు. పర్యావరణ పరిరక్షణ -- జల కాలుష్య నివారణ: మట్టి వినాయకుల వినియోగం ద్వారా నదులు, చెరువులు, జలాశయాలు కలుషితం కాకుండా కాపాడుకోవచ్చని, జల పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. సంప్రదాయాలకు ప్రాధాన్యత: బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రచారాన్ని వేగవంతం చేస్తున్నామని, మట్టి విగ్రహాలను వాడటం ద్వారా మన సాంప్రదాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందన్నారు. సామాజిక బాధ్యత: పర్యావరణాన్ని పరిరక్షించడం అనేది సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ స్పృహను పెంపొందించుకుంటూ, ప్రజలందరూ సురక్షితంగా, పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు





# హిట్లు ఉన్నా.. చాన్స్‌లు లేవు

## అవకాశాల కోసం మీనాక్షి చూపులు

'ఇచట వాహనములు నిలుపరాదు' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన మీనాక్షి చౌదరి అందం, అభినయంతో ఆకట్టుకుంది. 2024లో వరుస ఆఫర్లు అందుకుని పలు విజయాలను సొంతం చేసుకున్న ఆమెకు 'లక్కీ భాస్కర్' మంచి గుర్తింపును తీసుకొచ్చింది. దీంతో టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేయడం ఖాయమని అంతా భావించారు. అయితే ఆ తర్వాత పరిస్థితి మారిపోయింది. 2025లో 'సంక్రాంతికి వస్తున్నాం' మినహా మీనాక్షి పెద్దగా సినిమాల్లో కనిపించలేదు. వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం విజయవంతం కావడంతో మీనాక్షి పోషించిన మీనూ పాత్రకు మంచి స్పందన లభించింది. అయినా ఆశించిన స్థాయిలో కొత్త అవకాశాలు మాత్రం రాలేదు. ఈ ఏడాది 'అనగనగా ఒక రాజు'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన మీనాక్షి.. ప్రస్తుతం నాగచైతన్యతో కలిసి నటిస్తున్న 'వృషకర్మ'పై ఆశలు పెట్టుకుంది. ఈ చిత్రం డిసెంబర్ 4, 2026న విడుదల కానుంది. ఈ సినిమా తర్వాతైనా వరుస అవకాశాలు వస్తాయేమోనని మీనాక్షి అభిమానులు ఎదురుచూస్తున్నారు.



# ఫ్లోరల్ డ్రెస్‌లో మృణాల్

'సీతారామం' చిత్రంలో సీతామహాలక్ష్మిగా నటించి తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంది మృణాల్ ఠాకూర్. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఫ్లోరల్ డ్రెస్‌లో దేవకన్యలా మెరిసిపోతూ మృణాల్ ఇచ్చిన స్టైలిష్ పోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. తాజా ఫొటోషూట్ కోసం మృణాల్ ఠాకూర్ 'జిమ్మెర్‌మాన్' బ్రాండ్‌కు చెందిన 'డేలైట్ టైర్డ్ మ్యాక్సీ డ్రెస్'ను ఎంచుకుంది. ఫ్లోరల్ డిజైన్, నూడుల్ స్ట్రాప్స్, లేస్-అప్ ఫిటెడ్ బోడిస్‌తో కూడిన ఈ మల్టీ లేయర్డ్ అవుట్‌ఫిట్ ఆమెకు రొమాంటిక్, రాయల్ లుక్‌ను తీసుకొచ్చింది. మూడు వరుసల ప్లీటెడ్ టైర్స్, ఎంబ్రాయిడరీ లేస్ ట్రిమ్స్ డ్రెస్సింగ్‌కు మరింత గ్రాండ్ టచ్‌ను ఇచ్చాయి. ఈ లగ్జరీ అవుట్‌ఫిట్‌కు 'ఆక్వాజురా' హైహీల్స్, 'బ్లూమ్' బ్రాండ్ సీషెల్ చార్మ్ నెక్లేస్‌ను జత చేసింది. వదులుగా వదిలిన అలల జుట్టు, సహజమైన గ్లోయింగ్ మేకప్‌తో మృణాల్ మరింత అందంగా కనిపించింది. ఫొటోలను షేర్ చేస్తూ.. "డ్రెస్ తిప్పుతూ.. హృదయం నవ్వుతూ.. సంతోషం అంటే ఇదేనేమో!" అంటూ లవ్లీ క్యాప్షన్ ఇచ్చింది. దీంతో ఆమె అభిమానులు ఫిదా అవుతున్నారు.

- సినిమా డెస్క్, ఆంధ్రప్రభ

# గోల్డెన్ లెగ్ సంయుక్త

ఒక్క ఫ్లాప్‌తో అంతా తారుమారు



వరుస విజయాలతో టాలీవుడ్‌లో 'గోల్డెన్ లెగ్'గా పేరు తెచ్చుకున్న సంయుక్త మీనన్ ప్రస్తుతం మరోసారి వార్తల్లో నిలిచింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్లమ్ డాగ్–33 టెంపుల్ రోడ్' నుంచి ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదలైన పోస్టర్లు, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'బింబిసార', 'సార్', 'విరూపాక్ష' వంటి వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన సంయుక్త.. 'అఖండ 2', 'నారీ నారీ నడుమ మురారీ' వంటి చిత్రాలతోనూ ఆకట్టుకుంది. దీంతో ఆమెకు వరుస అవకాశాలు వస్తాయని అంతా భావించారు. అయితే పూరీ జగన్నాథ్ గత చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో.. ఈ కాంబినేషన్‌పై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. 'డబుల్ ఇస్మార్ట్'కు కూడా ఆశించిన స్థాయిలో ఫలితం రాకపోవడంతో, ఇప్పుడు పూరీతో సంయుక్త చేస్తున్న 'స్లమ్ డాగ్'పై అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా ఫలితం ఆమె కెరీర్‌కు ఎంతవరకు ప్లస్ అవుతుందో చూడాలి.

# ఖుషీ ఖుషీగా సెల్ఫీ

## శ్రీదేవి తనయ వీరపోజులు

దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తె, బాలీవుడ్ బ్యూటీ ఖుషీ కపూర్ తాజాగా షేర్ చేసిన మిర్రర్ సెల్ఫీలు నెట్టింట వైరల్‌గా మారాయి. అల్ట్రా మోడర్న్ లుక్‌లో క్యూట్ అండ్ గ్లామరస్ పోజులతో ఖుషీ ఆకట్టుకుంది. బ్లాక్ పోల్కా డాట్ హాల్టర్ క్రాప్ టాప్‌కు మ్యాచింగ్ ప్లీటెడ్ మినీ స్కర్ట్ ధరించి స్టైలిష్‌గా కనిపించింది. హై పోనీటైల్, చేతిపై టాటూతో ఆమె లుక్ మరింత ట్రెండీగా ఉంది. అథ్లేజర్‌తో కలిసి కోక్రియేట్ చేసిన 'సాఫ్ట్ సర్వ్' కలెక్షన్‌కు సంబంధించిన ఫొటోలను కూడా పంచుకున్న ఖుషీ.. "గేమ్స్, గెయిన్స్, డాగ్స్ అండ్ సాఫ్ట్ సర్వ్‌తో ఒక వారం'' అంటూ క్యాప్షన్ ఇచ్చింది.



# బీచ్ అందాల్లో సాయి రమ్య

వైట్ మ్యాక్సీ స్కర్ట్‌లో అదుర్స్!

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ నటి సాయి రమ్య పసుపులేటి తాజాగా షేర్ చేసిన బీచ్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సముద్రపు ఒడ్డున, సూర్యాస్తమయ వేళ ఆకాశంలో ఇంద్రధనుస్సు మెరిసే అందమైన వాతావరణంలో రమ్య ఇచ్చిన పోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. క్రీమ్ కలర్ ఓపెన్ బ్యాక్ హాల్టర్ క్రాప్ టాప్‌కు జతగా తెల్లటి ఫ్లోయీ మ్యాక్సీ స్కర్ట్ ధరించిన రమ్య.. క్యూట్ అండ్ స్టైలిష్ లుక్‌లో మెరిసిపోయింది. సముద్రపు గాలికి ఎగిరే జుట్టు, వెనుక సూర్యాస్తమయ కాంతులు, ఆకాశంలోని ఇంద్రధనుస్సు ఫొటోలకు మరింత డ్రీమీ టచ్‌ను ఇచ్చాయి. ''ఈ ఫొటోలను పోస్ట్ చేయాలని రియా అమీన్ నాకు గుర్తు చేసింది'' అంటూ రమ్య పెట్టిన క్యాప్షన్ కూడా ఆకట్టుకుంటోంది. ఈ పిక్స్ చూసిన అభిమానులు 'సో ప్రిటీ', 'చాలా క్యూట్‌గా ఉన్నావు' అంటూ కామెంట్లతో సందడి చేస్తున్నారు.

